క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన సీఐ

జూలూరుపాడు: జూలూరుపాడు (కొత్తగూడెం రూరల్) పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా డి.శ్రీలక్ష్మి శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆమెకు ఎస్సై బాదావత్ రవి మొక్క అందజేసి స్వాగతం పలికారు.

62 శాతం బొగ్గు ఉత్పత్తి

ఇల్లెందు: ఇల్లెందు ఏరియా బొగ్గు ఉత్పత్తి వివరాలను ఏరియా జీఎం వి.కృష్ణయ్య శుక్రవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో జూలై 2025లో సాధించిన వివరాలు వెల్లడించారు. జూలై నెలకు నిర్దేశించిన లక్ష్యం 2.13 లక్షల టన్నులకు 1.33 లక్షల టన్నులు ఉత్పత్తిని చేసి 62 శాతం సాధించినట్లు తెలిపారు.

ఎంఈఓకు ప్రశంస

కొత్తగూడెంఅర్బన్: ఇటీవల రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ యోగితారాణా ఉమ్మడి ఖమ్మం జిల్లాలను సందర్శించి పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కొత్తగూడెం మండల విద్యాశాఖ అధికారి డాక్టర్ ప్రభుదయాళ్ పనితీరును తెలుసుకొని ప్రత్యేకంగా లేఖ ద్వారా ప్రశంసించారు. ప్రస్తుతం ఆయన రామవరం ప్రభుత్వ హైస్కూల్, మండల విద్యాశాఖను నిర్వహిస్తున్నారు.

అనాథలకు సాయం చేద్దాం..

కొత్తగూడెంటౌన్: అనాథలు, మతిస్థిమితం లేని వారికి సాయం అందించాలని కొత్తగూడెం నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ వుమెన్ ఫౌండర్ ప్రెసిడెంట్, అడ్వకేట్ మల్లెల ఉషారాణి శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కొత్తగూడెంలో పలు చోట్ల అనాథలు తిరుగుతున్నారని తెలిపారు. వారికి మా ఆర్గనైజేషన్ తరుపున వారికి వస్త్రాలు, తినడానికి ఆహారం ఇస్తే తిరగబడ్డారని, ప్రభుత్వ అధికారులు స్పందించి వారిని రిహాబిలిటేషన్ సెంటర్లకు తరలించాలని కోరారు.

బాక్సింగ్‌లో స్వర్ణ పతకం

సింగరేణి(కొత్తగూడెం): చుంచుపల్లి మండలం, ధన్‌బాద్ గ్రామపంచాయతీలోని సెయింట్ జోసఫ్ పాఠశాలలో 9వ తరగతి విద్యార్థి ఎస్‌కే అరహాన్ అలీ జూలై 30న ప్రగతి మైదాన్‌లో జరిగిన జిల్లా బాక్సింగ్ చాంపియన్ షిప్–2025 పోటీల్లో స్వర్ణ పతకం సాధించాడు. ప్రిన్సిపాల్ బ్రదర్ రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం అరహాన్‌ను అభినందించారు.

దోమల నివారణ చర్యలు

ఇల్లెందు: వంద రోజుల ప్రణాళికలో భాగంగా పట్టణంలోని 19వ వార్డు దాసరిగడ్డలో శుక్రవారం డ్రై డే – ఫ్రైడే కార్యక్రమం నిర్వహించారు. దోమల నివారణ మందును స్ప్రేయింగ్ చేయించారు. ఇంటింటికీ తిరిగి నీటి నిల్వలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ శ్రీకాంత్ స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతీ ఇంటి ఆవరణను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

శక్తిపుంజ్ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించండి..

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు గనుల కార్మికుల సౌకర్యార్థం శక్తిపుంజ్ ఎక్స్‌ప్రెస్‌ను జబల్‌పూర్ నుంచి సికింద్రబాద్ వరకు పొడిగించాలని బీఎంఎస్ జాతీయ కార్యదర్శి కొత్తకాపు లక్ష్మారెడ్డి రైల్వేశాఖ మంత్రి వైష్ణవ్‌ను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గతంలో కూడా ప్రభుత్వానికి తెలియపరిచామని గుర్తుచేశారు.

పీవైఎల్ ధర్నా

ఇల్లెందురూరల్: పీహెచ్‌సీలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పీవైఎల్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఆస్పత్రి సిబ్బందికి అందజేశారు. మోతీలాల్ మాట్లాడుతూ.. పీహెచ్‌సీలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, అన్నిరకాల వ్యాధులకు మందులు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. శంకర్, రమేష్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలను విస్మరిస్తున్న పాలకులు

ఇల్లెందురూరల్: ఆదివాసీ హక్కులను పాలకులు విస్మరిస్తున్నారని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దుగ్గి కృష్ణ అన్నారు. మండలంలోని గిరిజన సీఎంహెచ్ హాస్టల్‌లో ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆయన ఆదివాసీ జెండాను ఆవిష్కరించారు. మాట్లాడుతూ... ఆదివాసీల అభ్యున్నతికి పాటుపడుతున్నామని చెబుతున్న పాలకులు ఆచరణలో విఫలమవుతున్నారని విమర్శించారు. వజ్జ సురేష్, కొడెం బోస్, కృష్ణ, ఈసం కవిత, రోహిణి, రమ్య తదితరులు పాల్గొన్నారు.

'స్వచ్ఛ మిత్ర'ల సమస్యలు పరిష్కరించాలి

పాల్వంచ: స్వచ్ఛ మిత్ర కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి.పద్మ, ఉపాధ్యక్షురాలు దొడ్డా రవికుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక సంఘం కార్యాలయంలో స్వచ్ఛ మిత్ర కార్మికుల మహాసభ జరిగింది. మాట్లాడుతూ.. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు, ప్రమాద బీమా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాఠశాలల మెయింటెనెన్స్‌కు ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. కె.సత్య, వెంకటనర్సమ్మ, సాజీదా, రమాదేవి, అనురాధ, లావణ్య, సమత, పెంటమ్మ, వెంకటరమణ, సులోచన, గంగమ్మ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బీమాతో ధీమా..

- రూ.2 లక్షల వరకు పరిహారం వర్తింపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఏడాదికి రూ. 20 ప్రీమియం


పెనగడప గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చుంచుపల్లి: గామీణ ప్రాంతాల కూలీలకు ఉపాధి హామీ పథకం అండగా నిలుస్తూ ఏడాదిలో వంద రోజుల పాటు పనిని కల్పిస్తోంది. ఈ పథకాన్ని మహిళలే అధికంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ముఖ్యంగా వేసవిలో ఇతర పనులు లేకపోవడంతో ఉపాధి పనులకు డిమాండ్ మరింతగా పెరుగుతుంది. రైతు సంక్షేమం కోసం చేపట్టే పనులతో పాటు ఇతర అభివృద్ధి పనులు చేపపడుతున్నారు. ప్రతీ సంవత్సరం ప్రభుత్వాలు కూలి రేటును పెంచుతున్నాయి. ప్రస్తుతం ఒకరోజు గరిష్ట కూలి రూ.307 నిర్ణయించారు. జాబ్ కార్డు పొందిన ప్రతీ ఒక్కరికి కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఎవరైనా ఉపాధి కూలీ ప్రమాదవశాత్తు మృతి చెందినా, వందశాతం అంగవైకల్యం పొందినా.. వారికి రూ.2 లక్షల బీమా వర్తించనుంది. దీనికి సంబంధించి మార్గదర్శకాలు విడుదలయ్యాయి. ఉపాధి కూలీలతో ప్రీమియం సొమ్ము చెల్లించేలా ప్రోత్సహించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పటి వరకు ఉపాధి హామీ పని ప్రదేశాల్లో ఏదైనా కారణంతో మృతి చెందినవారికి రూ.2 లక్షల బీమా చెల్లించేవారు. గాయపడిన వారికి కూడా వైద్య ఖర్చులకు సాయం అందేది. ప్రస్తుతం పని ప్రదేశాల్లో కాకుండా ప్రీమియం చెల్లించిన ప్రతీ కూలీకి బీమా సొమ్ము చెల్లించనున్నారు. ఇందుకోసం బ్యాంకులో రూ.20 చెల్లించి బీమా ప్రీమియం చెల్లించాలి. ప్రీమియం చెల్లించిన వారు పనికి వెళ్లకున్నా ప్రమాదవశాత్తు మరణిస్తే కూడా ఈ బీమా సొమ్ము వస్తుంది.

పీఎంఎస్‌బీవై ద్వారా అమలు...

చుంచుపల్లి మండలంలోని 18 గ్రామపంచాయతీల పరిధిలో 6,941 ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నాయి. వీటి పరిధిలో 12,969 మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. ఇందులో మహిళలు 6,861 కాగా, పురుషులు 6,108 మంది ఉన్నారు. ఉపాధి హామీలో పని చేసే కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు చేపట్టాయి. ఉపాధి హామీ పనులు చేసే సమయంలో నిత్యం ఏదో ఒకచోట ఏదో ఒక ఘటన జరుగుతోంది. గాయాల పాలవడంతో పాటు మత్యువాత పడిన సందర్భాలు కూడా ఉన్నాయి.

బీమా ప్రీమియం చెల్లించిన వారికి ప్రమాదవశాత్తు గాయాలై పనిచేయని స్థితిలో ఉన్న వారికి రూ.లక్ష, మత్యువాత పడితే రూ.2లక్షల బీమా వర్తిస్తుంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీలకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకం ద్వారా ఈ బీమా సౌకర్యం కల్పిస్తుంది. ఈ పథకంలో ఉపాధి హామీ కూలీగా ఉండి 18 నుంచి 70 సంవత్సరాల లోపు ఉన్నవారు అర్హులుగా నిర్ణయించారు. ఉపాధి కూలీ సంబంధిత జాతీయ బ్యాంకుతో బీమా చేయించుకునేందుకు అంగీకారం కుదుర్చుకొని ప్రతీ సంవత్సరం రూ.20 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. వ్యక్తిగత ఖాతా ఉన్న జాతీయ బ్యాంకు లేదా పోస్టాఫీసులో తన పేరు నమోదు చేసుకుని, ఆధార్ నంబరుతో అనుసంధానం చేయించుకోవాలి. బ్యాంకులో ఈ బీమా పథకంలో చేరాలని రాతపూర్వక అభ్యర్థనతోపాటు, ఏటా తమ ఖాతా నుంచి రూ.20 బీమా ప్రీమియంను చెల్లించడానికి అనుమతిస్తూ లేఖ ఇవ్వాలి. ఒక సారి లేఖ ఇస్తే ప్రతీ సంవత్సరం బీమా ప్రీమియం ఆటోమేటిక్‌గా కూలీ ఖాతా నుంచి డెబిట్ చేస్తుంది. ఈ వివరాలను ఉపాధి హామీ సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చు.

బీమాతో ప్రయోజనం...



ఉపాధి కూలీలకు బీమా పథకాన్ని అమలు చేయడం మంచి పరిణామం. ఇప్పటి వరకు పని ప్రదేశాల్లో ఏదైనా కారణంతో మృతి చెందినవారికి రూ.2 లక్షల బీమా చెల్లించేవారు. ప్రస్తుతం పని ప్రదేశాల్లోనే కాకుండా ప్రీమియం చెల్లించిన ప్రతీ కూలీకి బీమా సొమ్ము చెల్లించనున్నారు. ఇందుకోసం బ్యాంకులో రూ.20 చెల్లించి బీమా తీసుకుంటున్నాం.

– ఆంగోత్ భాస్కర్, ఉపాధి కూలీ

ప్రీమియం కట్టిస్తున్నాం..



ఉపాధి కూలీలకు ప్రభుత్వం తాజాగా అమల్లోకి తెచ్చిన ప్రమాద బీమా సౌకర్యం విషయంలో అవగాహన కల్పిస్తూ ప్రతీ కూలీ చేత బీమా ప్రీమియం కట్టిస్తున్నాం. ఇది సౌకర్యం కూలీలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంది. మండలంలోని అన్ని పంచాయతీల్లో ప్రతీ ఉపాధి కూలీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా చూస్తున్నాం.

– రఘుపతి, ఏపీఓ, చుంచుపల్లి

ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన


టేకులపల్లి: గోలియాతండాతీలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

టేకులపల్లి: ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపుపై ఎవరూ నిరాశ చెందవద్దని అర్హులందరికీ రెండో విడత ఇళ్లు మంజూరవుతాయని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం ప్రెగళ్లపాడు, రాంపురం, పి.కొత్తతండా, తావుర్యాతండా, టేకులపల్లి, దాసుతండా, గోల్యాతండా, తొమ్మిదోమైలు తండా, రోళ్లపాడు, బేతంపూడి గ్రామ పంచాయతీల్లో పర్యటించి ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ బైరు మల్లీశ్వరి, ఏఈలు నవీన్, గణేష్, కోరం సురేందర్, భూక్య దేవా, ఏఎంసీ చైర్మన్ రాంబాబు, ఆత్మ చైర్మన్ మంగీలాల్, సురేందర్ పాల్గొన్నారు.

కార్యదర్శిని మందలించిన ఎమ్మెల్యే...

టేకులపల్లి పంచాయతీ ట్యాంకు బజారులో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన అనంతరం ప్రజలతో మాట్లాడుతున్న సమయంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ఇందిరమ్మ కమిటీ సభ్యులుగా తమను గుర్తించడం లేదని టేకులపల్లి జీపీ ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న టేకులపల్లి కార్యదర్శిని మందలించారు.

జూలూరుపాడు: మండలంలోని పలు గ్రామాల్లో ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు కొనసాగుతున్నాయి. శుక్రవారం వెంగన్నపాలెం, పడమటనర్సాపురం, జూలూరుపాడు, భోజ్యాతండా తదితర గ్రామాల్లో లబ్ధిదారులతో కలిసి కాంగ్రెస్ నాయకులు శంకుస్థాపన చేశారు. లేళ్ల వెంకటరెడ్డి, లేళ్ల గోపాల్‌రెడ్డి, నున్నా రంగారావు, మాచినేని సత్యనారాయణ, దుద్దుకూరి నరసింహారావు, మధుసూదన్‌రావు, వెలగా తిరుపతిరావు, గరిడేపల్లి రామయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో వన మహోత్సవం

ఇల్లెందు: ఇల్లెందు ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఎమ్మెల్యే కోరం కనకయ్య మునగ మొక్కలు నాటారు. శుక్రవారం వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ ఆదేశానుసారం డీసీహెచ్ఎస్ డాక్టర్ రవిబాబు, సూపరింటెండెంట్ డాక్టర్ హర్షవర్ధన్‌ల ఆధ్వర్యంలో 150 మునగ, ఉసిరి, దానిమ్మ, నిమ్మ మొక్కలు నాటారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం..

ఇల్లెందు ప్రభుత్వాస్పత్రిలో అదనపు ఆపరేషన్ గదిని ఎమ్మెల్యే కోరం కనకయ్య ప్రారంభించారు. బాలింతలతో ఆరోగ్య క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డాక్టర్ రాంనివాస్, షకీర్, ఫర్జానా, బానోతు రాంబాబు, సయ్యద్ జానీపాషా, సాంబమూర్తి, పులి సైదులు, తాటి భిక్షం, ముక్తి కృష్ణ, గందె సదానందం తదితరులు పాల్గొన్నారు.

'నో వర్క్ నో పే' సర్క్యులర్ విడుదల చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): నో వర్క్ నో పే సర్క్యులర్ విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం సివిల్ జీఎం దనసరి వెంకటేశ్వర్లుకు ఇఫ్టూ నాయకులు వినతిపత్రం అందజేశారు. మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్‌కోడ్లకు వ్యతిరేకంగా జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా జూలై 9న సమ్మెకు పిలుపునివ్వడం జరిగింది. అందులో భాగంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులు కూడా సమ్మెలో పాల్గొన్నట్లు తెలిపారు. నాలుగు లేబర్‌కోడ్లలను రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తే కాంట్రాక్ట్ కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. కనుక సింగరేణి యాజమాన్యం చొరవ తీసుకొని నో వర్క్ నో పే సర్క్యులర్ జారీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంజీవ్, కొండపల్లి శ్రీనివాస్, మల్లికార్జున్, అంజయ్య, జే.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కోసం పోరాడుదాం..


మాట్లాడుతున్న అనురాధ

టేకులపల్లి: భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాల కోసం పోరాటాలకు సిద్ధంగా ఉండాలని తెలంగాణ ప్రగతిశీల భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (ఐఎఫ్టీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు జి.అనురాధ, ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షుడు కొక్కు సారంగపాణి, భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రావూరి ఉపేందర్ రావు, ఇఫ్టూ టేకులపల్లి ఏరియా కార్యదర్శి డి.ప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో టేకులపల్లి ఏరియా జనరల్ బాడీ సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ.. కార్మికుల నుంచి సెస్ రూపంలో వసూలు చేస్తున్న రూ.కోట్లను ప్రభుత్వాలు కొల్లగొడుతున్నాయని, కార్మికుల శ్రేయస్సుకు ఉపయోగించడం లేదని విమర్శించారు. కార్మికుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన బోర్డులో అనేక లోపాలు ఉన్నాయని వాటిని సరిచేయాలని డిమాండ్ చేశారు. భవన నిర్మాణ కార్మికులు అందమైన భవనాలు కడుతూ రంగులు వేస్తూ వారికి మాత్రం ఉండటానికి ఇల్లు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు మొదటి ప్రాధాన్యతగా ఇందిరమ్మ ఇల్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రతీ కార్మికుడు లేబర్ కార్డు తీసుకుని ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలు ఉపయోగించుకోవాలని సూచించారు. బండారి మధు, పెనక సత్యనారాయణ, ఈసం కార్తీక్, మెండు వినోద్, ఆత్మకూరి శ్రీను, బండారి శ్రీను, కానుగుల వెంకన్న, జక్కుల వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు


సుజాతనగర్: ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పాల్వంచరూరల్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తొలిరోజు శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలోని అంగన్‌వాడీ టీచర్లు, సూపర్‌వైజర్లు ఇంటింటికీ వెళ్లారు. పాండురంగాపురం, ఉల్వనూరు, జగన్నాథపురం సెక్టార్లలో అంగన్‌వాడీ టీచర్లు.. గర్భవతుల ఇంటింటికీ వెళ్లి డెలివరీ అయిన వెంటనే బిడ్డకు తల్లిపాలు పట్టించాలని అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు సుధతి, అశోకా, మాధవి అంగన్‌వాడీ టీచర్లు కళావతి, కృష్ణకుమారి, కె.వీరభద్రమ్మ, ఏఎన్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

సుజాతనగర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం అర్బన్ ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతను, శిశువుల ఆరోగ్యానికి తల్లి పాల ద్వారా కలిగే ప్రయోజనాలను సూపర్‌వైజర్ రమణ వివరించారు. తల్లిపాల ద్వారా రోగ నిరోధక శక్తి పెరిగి శిశువులు వ్యాధుల నుంచి రక్షించబడతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మల, శారద, కళావతి, పద్మ, మాధవి, సరస్వతి, అనిత, సరోజ, హేమలత, వీరమ్మ, రుక్మిణి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

పాల్వంచ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఎన్‌పీడీసీఎల్ ఏడీఈ రెహముల్ హుస్సేన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి 12 వరకు అయ్యప్పనగర్, గాంధీనగర్, భద్రాచలం రోడ్, శ్రీనగర్ కాలనీ, ఒడ్డుగూడెం, కరకవాగు, గాజుల గూడెం, గొల్లగూడెం ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తామని, ప్రజలు సహకరించాలని కోరారు.

13న దివ్యాంగుల మహాగర్జన

టేకులపల్లి: 13న హైదరాబాద్‌లో దివ్యాంగుల మహాగర్జన కు భారీ సంఖ్యలో తరలిరావాలని వీహెచ్‌పీఎస్ కొత్తగూడెం జిల్లా ఇన్‌చార్జ్ మచ్చ ఏడుకొండలు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో వీహెచ్‌పీఎస్ సమావేశంలో మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 20 నెలలు గడుస్తున్నా వికలాంగుల, వితంతువుల, వృద్ధుల పెన్షన్ పెంచకపోవడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు వాళ్ల జీతాలు పెంచుకున్నారని విమర్శించారు. పోరాడితేనే పెన్షన్ పెరుగుతుందని, 13న హైదరాబాద్‌లో దివ్యాంగుల మహాగర్జన ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పీఆర్‌సీపై ప్రభుత్వ జాప్యం సరికాదు

టేకులపల్లి: ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) మూడు దశల పోరాట కార్యక్రమాల్లో భాగంగా ఈనెల 5న కొత్తగూడెంలో యూఎస్‌పీసీ ఆధ్వర్యంలో జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు గుగులోత్ హరిలాల్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం ఆశ్రమ ఉన్నత పాఠశాలలో కరపత్రాలు ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రభుత్వం మారి రెండేళ్లు కావస్తున్నా ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్సీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించారు. గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల షెడ్యూల్ ప్రకటించాలని, పండిట్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం జగన్, బుగ్గ వెంకటేశ్వర్లు, పి.సమ్మయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవం

జూలూరుపాడు: ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్సవాన్ని శుక్రవారం జూలూరుపాడులో ఆటో డ్రైవర్లు ఘనంగా జరుపుకున్నారు. తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మపురి నరేష్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టోలో ఆటో కార్మికులకు సంవత్సరానికి రూ.12 వేలు ఇస్తామని హామీ ఇచ్చారని, అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కొత్తగూడెం ఆర్‌వీఎం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆటోడ్రైవర్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో బానోత్ నాగేశ్వరరావు, ఇందోజు బసవాచారి, బానోత్ వీరు నాయక్, లావుడ్యా నరేష్, పోతురాజు మురళీకృష్ణ, కొండా సత్యనారాయణ, రంజిత్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు మెరుగైన ప్యాకేజీ ఇవ్వాలి


మాట్లాడుతున్న అఖిలపక్షం నాయకులు

ఇల్లెందురూరల్: జేకే ఓసీ నిర్వాసితుల సమస్యలు తక్షణం పరిష్కరించాలని 21పిట్ ఏరియా అఖిలపక్ష కమిటీ డిమాండ్ చేసింది. మండలంలోని 21పిట్ ఏరియాలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో సింగరేణి సంస్థ మరికొంత కాలం నిలబడాలన్న ఆకాంక్షతో జేకే ఓసీ విస్తరణకు తాము సానుకూలంగా స్పందించామన్నారు. కానీ నిర్వాసితులుగా మారుతున్న ఈ ప్రాంత ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి సింగరేణి అవలంబిస్తున్న వైఖరిని చూస్తూ ఊరుకోబోమన్నారు. నిబంధనలకు అనుగుణంగా పూర్తిస్థాయిలో ప్యాకేజీ ఇవ్వాలని, నిర్వాసిత ప్రాంతం పోను మిగిలిన ప్రాంతాన్ని స్థానికులకే అప్పగించాలని డిమాండ్ చేశారు. పూసపల్లి సమీపంలో రైతులను ఎస్అండ్‌పీసీ అధికారులు దౌర్జన్యంగా వాహనంలో తరలించి నిర్బంధించడం సరికాదన్నారు. ఇటువంటి అధికారులపై తక్షణం చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పూనెం సురేందర్, అబ్దుల్ నబీ, వడ్ల శ్రీను, ధనసరి రాజు, పూనెం మధు, క్లింట్, తాండ్ర లక్ష్మీనారాయణ, లాలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణతో తీవ్ర అన్యాయం


టేకులపల్లి: నిరసన తెలుపుతున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: ఎస్సీ ఉప వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ శుక్రవారం కొత్తగూడెం బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట మాల మహానాడు కార్యకర్తల ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జిలతో నిరసన చేపట్టారు. సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ ఎస్.మధుసూదన్‌రావు మాట్లాడుతూ. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో పాస్ చేయడం వలన మాలలకు అన్యాయం జరుగుతుందన్నారు. మాలల ఉనికి, సంక్షేమం, ఐక్యత కోసం రాష్ట్ర నాయకత్వం తీసుకునే ఎలాంటి నిర్ణయాలకైనా కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కూరపాటి రవీందర్, నక్కా సృజన, మేరుగు చింటూ, గాదం రాజేందర్, జల్లి రాజేష్, సుదర్శన్ పాల్గొన్నారు.

టేకులపల్లి: ఎస్సీ వర్గీకరణ వల్ల మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని జాతీయ మాలమహానాడు టేకులపల్లి మండల అధ్యక్షుడు కర్లపూడి సుందర్‌పాల్ అన్నారు. ఈ మేరకు గత సంవత్సరం ఆగస్టు 1న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం చేసిన ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ శుక్రవారం బ్లాక్ డేగా పరిగణిస్తూ నల్లబ్యాడ్జిలు ధరించి సులానగర్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలియజేశారు. మాట్లాడుతూ.. ప్రమోషన్లు, మెడికల్ సీట్లు, ఇంజనీరింగ్‌లో రోస్టర్ విధానాన్ని నిలిపివేసి జీఓ 99 రద్దు చేయాలని కోరారు. గత ప్రభుత్వంలో ఏజెన్సీలో రద్దయిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను జనరల్‌లో కలపడం వలన ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఎస్సీలకు తీవ్ర అన్యాయం జరిగిందని దీనిని పునఃసమీక్షించాలని కోరారు. డాక్టర్ రాజు, తోడేటి యాకోబ్, మాలప్రోలు జయరాజు, ఉండేటి దేవరాజు, కొప్పుల శ్రీరాములు, గండమల్ల చెన్నయ్య పాల్గొన్నారు.

చట్టం కొందరికి చుట్టమా..?

- ఆక్రమణలు, భారీ నిర్మాణాలపై ఉదాసీనత
- పేదల గూడుకేనా అభ్యంతరాలు
- చర్చనీయాంశంగా మారిన పెద్దల తీరు


నిలిచిపోయిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణం


స్వాధీన భూమిలో రైతులు సాగు చేసిన పత్తిపంట

ఇల్లెందురూరల్: చట్టం ఎవరికీ చుట్టం కాదు. అందరూ సమానమే. ఇవి సభలు.. సమావేశాలలో మన పెద్దలు చెప్పే మంచి మాట. కానీ ఆచరణలో మాత్రం చాలా వ్యత్యాసం ఉంటోంది. పెద్దలను వదిలేసి పేదలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండలంలో ప్రస్తుతం ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయి.

నిలువ నీడపైనా అభ్యంతరాలు...

సింగరేణిలో తొలి కార్మికవాడ 21పిట్ ఏరియా. ప్రారంభంలో గుడిసెలలో నివాసం ఉన్న కార్మికులకు సంస్థ తొలిసారిగా క్వార్టర్లను నిర్మించింది. దశాబ్దాలు గడిచిన తరువాత 21పిట్ పరిధిలో సింగరేణి సంస్థ లీజు గడువు ముగియడంతో 2016లో అప్పటి పంచాయతీ ప్రజాప్రతినిధులతో గ్రామసభ నిర్వహించి లీజు గడువు పొడిగించారు. కానీ అప్పటికే నివాసం ఉంటున్న ఇళ్లతో సహా లీజు పొడిగించారా.. స్థలాలకు మాత్రమేనా.. సమాధానం లభించకపోవడం విచారకరం. ఇదిలా ఉండగా సింగరేణి సంస్థ ఆదేశంతో గుడిసెలు నిర్మించుకున్న నాటి కార్మికుల వారసులు నేడు ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణంపై అధికారులు అభ్యంతరం చెబుతున్నారు. 2007లో ఇందిరమ్మ పథకంలో భాగంగా ఇంటి స్థలం కేటాయిస్తూ రెవెన్యూ అధికారులు జారీ చేసిన ధృవీకరణ పత్రాలున్న నలుగురు లబ్ధిదారుల ఇంటి నిర్మాణంపైనా సింగరేణి అధికారులు అభ్యంతరం చెప్పడం స్థానికులను కలవరపాటుకు గురిచేస్తోంది.


చర్చనీయాంశంగా భూముల అప్పగింత..

పూసపల్లి గ్రామ సమీపంలో విజయలక్ష్మీనగర్‌కు చెందిన గిరిజనులు సర్వే నంబర్ 588/2 పరిధిలో 7.08 ఎకారల విస్తీర్ణంలో దశాబ్దాలుగా పంటలు సాగు చేస్తున్నారు. సాగుభూములను సింగరేణి, అటవీ, రెవెన్యూ అధికారులు సర్వే చేసి వేసిన పంటలను పరిశీలించారు. కానీ ఇటీవల సదరు భూమి మీకు ఎలా వచ్చిందని ప్రశ్నిస్తూ నోటీసులు జారీ చేయడంతోపాటు స్వాధీనం చేసుకొని సింగరేణికి అప్పగిస్తున్నట్లు తహసీల్దార్ తుది తీర్పును ప్రకటించారు. కానీ సింగరేణి సంస్థకు భూమిని అప్పగించాలంటే నిబంధనల ప్రకారం గ్రామసభ నిర్వహించి లీజు పరిధిలో చేర్చాలి. లేదంటే సింగరేణి ఆధీనంలో ఉన్న భూమిని స్వాధీనం చేసుకొని దానికి బదులుగా మరోచోట భూమిని అప్పగించాలి. ఇక్కడ భూబదలాయింపు ఎలా చేశారో ఎవరూ చెప్పకపోవడం పలు ప్రశ్నలను తావిస్తోంది. అంతేకాకుండా జేకే ఓసీ విస్తరణ పనుల కోసం సీఎస్పీ బస్తీ పంచాయతీ సర్వే నంబర్ 549 పరిధిలో సింగరేణికి అవసరమైన 261.33 ఎకరాల విస్తీర్ణంలో సర్వే చేసి ఆర్ఓఎఫ్ఆర్ గ్రామసభ నిర్వహించారు. అటవీ, రెవెన్యూ భూమి ఎక్కడైనా రైతులు సాగు చేసుకుంటే.. గిరిజనులైనా, గిరిజనేతరులైనా పరిహారం చెల్లిస్తామని గ్రామసభలో అప్పటి ఆర్డీఓ స్వర్ణలత స్పష్టం చేశారు. ఇందుకు భిన్నంగా తొమ్మిది మంది గిరిజనులు సాగు చేసుకుంటున్న 7.08 ఎకరాల భూమిపై తాజాగా అధికారులు వ్యవహరిస్తున్న తీరు విమర్శలకు తావిస్తోంది.

ఆక్రమణలపై ఉదాసీనత...


అర ఎకరం విస్తీర్ణంలో సాగు చేసుకుంటున్న రైతులపై చట్టాలను వల్లె వేస్తూ భూములు స్వాధీనం చేసుకున్న రెవెన్యూ, సింగరేణి అధికారులు తమ ఆధీనంలో ఉన్న భూములు అన్యాక్రాంతమైనా ఉదాసీనంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది. రెవెన్యూ భూములు ఆక్రమణకు గురైతే గతంలో ఆర్డీఓ స్థాయి అధికారి దగ్గరుండి మరీ ఆక్రమణలను తొలగింపజేశారు. కానీ నేడు అదే భూమి అన్యాక్రాంతమైనా పట్టించుకోకపోవడం, తమ లీజు పరిధిలో ఉన్న భూములలో భారీ భవనాలు నిర్మించినా.. సదరు ఇళ్లకు ఇంటి నంబర్లు ఇవ్వడం జరిగినా.. అవి పెద్దలవని, ఆయా నిర్మాణాల వెనక పెద్దలున్నారన్న పేరుతో సింగరేణి అధికారులు ప్రేక్షక పాత్ర పోషించడంలో ఆంతర్యమేమిటన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

అడ్డుకోవడం అన్యాయం



మాకు 2007లోనే రెవెన్యూ అధికారులు ఇంటి స్థలానికి సంబంధించి పట్టా ఇచ్చారు. సదరు ధృవీకరణ పత్రం ఆధారంగా అధికారులు ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేశారు. కానీ సింగరేణి అధికారులు అది తమ స్థలమంటూ నిర్మాణాలను అడ్డుకుంటున్నారు. – వాసం విజయ, విజయలక్ష్మీనగర్

మా హక్కులను హరిస్తున్నారు...



తాతముత్తాల కాలం నుంచి భూమిని సాగు చేసుకుంటున్నాం. గతంలో పట్టా కోసం దరఖాస్తు చేసుకుంటే రెవెన్యూ, అటవీశాఖలు తమదికాదంటే తమది కాదని తిప్పుకున్నాయి. నేడు అదే భూమిని సింగరేణికి అప్పగిస్తున్నట్లు ప్రకటించడం అన్యాయం. – ఎట్టి హరికృష్ణ, తిలక్‌నగర్